ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 28-10.2025 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వేములవాడ ఆలయ అభివృద్ధి వివరాలను శృంగేరి జగత్ గురులు విధుశేఖర భారతీస్వామికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.
2. మద్ధతు ధర క్రింద చేపట్టనున్న పంటల కొనుగోలుకు వెంటనే అవసరమైన అనుమతులు ఇవ్వాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ కు రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు.
3. దివ్యాంగుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ అధ్యక్షుడు రామ చందర్ రావు విమర్శించారు.
4. తెలంగాణ రాష్ట్రంపైనా మొంథా తుపాను ప్రభావం ఉంటుందన్న హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తమైంది.

---------------------------

**స్వామి**

హైదరాబాద్ నల్లకుంటలోని శంకర మఠంలో శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. "ధర్మ విజయ యాత్ర" లో భాగంగా విధుశేఖర భారతీస్వామి హైదరాబాద్ కు విచ్చేశారు. ఈ సందర్భంగా వేములవాడ ఆలయ అభివృద్ధి వివరాలను భారతీస్వామి వారికి ముఖ్యమంత్రి వివరించారు. ఆయన వెంట వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూడా ఉన్నారు.

**పీఎస్**

-------------------

**వేలం**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి రేపు న్యూఢిల్లీలో 14వ విడత వాణిజ్య బొగ్గు గనుల వేలాన్ని ప్రారంభిస్తారు. వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహించడం, విభిన్న పెట్టుబడులను ఆకర్షించడం, విస్తృత పరిశ్రమ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ వేలం లక్ష్యమని బొగ్గు మంత్రిత్వ శాఖ తెలియజేసింది. మొదటిసారిగా, భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ (UCG) కోసం కూడా ఈ వేలంలో ప్రవేశపెడుతోందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. సాంప్రదాయ పద్ధతుల ద్వారా తవ్వలేని లోతైన బొగ్గు నిల్వలను, వనరులను ఉపయోగించుకునే చొరవను UCG సూచిస్తుంది.

**ఎస్ఎస్డీ**

---------------------------

**పీఎస్ఎస్**

Price Support Scheme (PSS) కింద చేపట్టనున్న పంటల కొనుగోలుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పెసర, మినుము పంటలు వందశాతం, అలాగే, సోయాబీన్ పంటలను 50శాతం వరకు కనీస మద్దతు ధర (MSP) కింద కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రి తుమ్మల కోరారు. మొక్కజొన్న, జొన్న పంటలను కూడా Price Support Scheme లో చేర్చాలని మరోసారి గుర్తు చేశారు. నిన్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఈమేరకు విజ్ఞప్తి చేశారు.

**పీఎస్**

---------------------

**బీజేపీ**

దివ్యాంగుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారికి పెన్షన్ 6వేల

రూపాయలకు పెంచుతామన్న హామీ నెరవేర్చడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. ఈరోజు పలువురు దివ్యాంగులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సమస్యలు తెలుసుకుని, అవసరాలు గురించి ఆరా తీశారు. దివ్యాంగులు సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు పొందేలా బిజెపి కృషి చేస్తోందని రామచందర్ రావు వారికి భరోసా కల్పించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం దివ్యాంగుల కోసం చేసిన సంక్షేమ కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు.

**పీఎస్**

----------------------

**లొంగుబాటు**

రాష్ట్రానికి చెందిన మావోయిస్ట్ పార్టీ కీలక నేత, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ పోలీసు డైరెక్టర్ జనరల్ శివధర్ రెడ్డి ముందు ఈరోజు లొంగిపోయారు. మావోయిస్ట్ పార్టీ అనుబంధ సంస్థ సింగరేణి కార్మిక సంఘం అధ్యక్షుడుగా బండి ప్రకాష్ పనిచేశారు. 45 సంవత్సరాలుగా సిపిఐ మావోయిస్టు పార్టీ లో వివిధ స్థాయిలలో పనిచేశాడు.

**డెస్క్**

---------------------

**సంతాపం**

బీఆర్ఎస్ శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ ఈ తెల్లవారుజామున మరణించారు. ఆయన మరణం పట్ల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ముఖ్యమంతి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, సహా పలువురు సంతాపం వ్యక్తం చేసారు.

**డెస్క్, పీటీసీ, కరీంగనర్, సంగారెడ్డి,**

--------------------------

**నషా ముక్త భారత్**

మాదక ద్రవ్యాల వాడకం తీవ్రమైన సామాజిక, మానసిక సమస్యలకు దారితీస్తుందనీ, దీనిని తొలి దశలోనే నివారించాలని భారత ఆహార సంస్థ, నల్గొండ జిల్లా కార్యాలయ డీఎం సువీన్‌కుమార్ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా భారత ఆహార సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వ్యసనంతో కలిగే దుష్పరిణామాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**పీటీసీ నల్గొండ**

---------------------

**అవగాహన**

వరి పంట కోతకు వచ్చిన సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతులకు, హార్వెస్టర్ యజమానులకు రైతు వేదికలలో వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా చందుర్తి మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు మాట్లాడుతూ.....

**బైట్ – దుర్గరాజు**

**పీటీసీ సిరిసిల్ల**

---------------------

**కాలేజీ**

రాష్ట్రంలోనే ప్రత్యేకమైన గిరిజన గురుకుల న్యాయ కళాశాలలో రేపు స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణతతో పాటు, ఐదేళ్ల లా సెట్ ప్రవేశ పరీక్షలో ఎంపికై ఉండాలని ప్రిన్సిపాల్ తెలిపారు. జనరల్ కేటగిరీలో 2 సీట్లు, బీసీలకు రెండు, ఎస్ టి కేటగిరిలో 35 సీట్లు భర్తీ చేయాల్సి ఉందన్నారు.

**పీటీసీ సంగారెడ్డి**

---------------------

**మొంథా**

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తీవ్ర తుపానుగా బలపడిందని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గంటకు 15 కి.మీ వేగంతో ఉత్తర వాయవ్య దిశగా తుపాను కదిలిందని తెలిపింది. ఈరోజు సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీవ్ర తుపాను తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 110 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేసింది.

ఇప్పటికే తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

**పీఎస్**

------------------------------------

**మోంథా ప్రభుత్వం**

మోంథా తుఫాన్ ప్రభావం తెలంగాణ రాష్ట్రంలోనూ ఉండవచ్చన్న హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వానాకాలం ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటలు దెబ్బ తినకుండా ముందస్తు జాగ్రత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. అందులో భాగంగా నిన్న సాయంత్రం నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిన్న అన్నిజిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులు నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు.

**పీఎస్**

-------------------------------

**మొంథా తెలంగాణ**

మొంథా తుఫాను ప్రభావం రాష్ట్ర వ్యాప్తంగా కనిపిస్తోంది, ఆయా జిల్లాల్లో నిన్న రాత్రినుంచే వర్షాలు కురుస్తున్నాయి. తుపాను ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందన్న హెచ్చరికలతో

ఆయా జిల్లాల ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. రైతులకు నష్టం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లు అధికారులను ఆదేశించారు.

**పీటీసీ, ఆసిఫాబాద్, కామారెడ్డి,**

------------------------

**వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో కార్తీక తొలి సోమవారం సందర్భంగా నిన్న రాత్రి స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిం చారు. 365 చిన్న ప్రమిదలను తయారు చేసి లింగాకారంలో పేర్చి విశేష పూజలు నిర్వహించి వెలిగించారు.
మరోవైపు.. భీమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిన్న రాత్రి కార్తీకదీపోత్సవం ఘనంగా నిర్వహించారు.

**పీటీసీ సిరిసిల్ల**

------------------------

**యానిమేషన్**

అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు. యానిమేషన్ కళను, దాని ప్రాముఖ్యతను, ప్రపంచవ్యాప్త ప్రభావాన్ని గౌరవించడానికి 2002లో ఇంటర్నేషనల్ యానిమేటెడ్ ఫిల్మ్ అసోసియేషన్ (ASIFA) ఈ రోజును ప్రారంభించింది. 1892వ సంవత్సరం అక్టోబర్ 28న పారిస్‌లోని చార్లెస్-ఎమిలే రేనాడ్ చేసిన మొదటి పబ్లిక్ యానిమేటెడ్ చిత్రాల ప్రదర్శనను గుర్తుచేసుకోవడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. యానిమేషన్ కళాకారులను, కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తారు.

**డెస్క్**

---------------------

**ఛట్**

ఉత్తర భారత దేశంలో ఘనంగా నిర్వహించే ఛట్ పూజ ఉత్సవాలు ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో గల ఎస్పీఎమ్ మైదానంలో నిన్న రాత్రి సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిర్పూర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

**పీటీసీ ఆసిఫాబాద్**

---------------------------------

**ఫోన్ లు**

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన CEIR పోర్టల్ సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు వరం లాంటిదని నల్లగొండ డిఎస్పీ కె.శివరాం రెడ్డి అన్నారు. జిల్లాలో సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు నిందితుల నుంచి రికవరి చేసిన సెల్ ఫోన్ లను తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోన్ పోగొట్టుకున్న బాదితులు వెంటనే నంబర్ బ్లాక్ చేసి, బ్యాంక్ ఖాతాలను రక్షించుకోవాలనీ, ఆతరువాత సిఈఐఆర్ పోర్టల్ లో తమ వివరాలు, ఫోన్ వివరాలు అప్లోడ్ చేయాలని అన్నారు.

**పీటీసీ నల్గొండ**

-------------------------